ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్), తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్(టీవోఏ) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రన్ నిర్వహించారు. నగరంలోని 14 కేంద్రాల నుంచి ఒలింపిక్ డే రన్ ఎల్బీ స్టేడియానికి చేరుకుంది. టెన్నిస్ కాంప్లెక్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ప్లేయర్లు సందడి చేశారు. ఈ పరుగులో అర్జున అవార్డు గ్రహీతలకు తోడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ప్లేయర్లు పాలుపంచుకున్నారు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీహరి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, టీవోఏ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, సాట్స్ ఎండీ సోనీ బాలదేవి తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు ఏడు పతకాలు

సీషెల్స్ నేషనల్ డే బాక్సింగ్ డే టోర్నీ

మాహె(సీషెల్స్): సీషెల్స్ నేషనల్ డే బాక్సింగ్ డే టోర్నీలో భారత బాక్సర్లు దుమ్మురేపారు. టోర్నీలో మూడు స్వర్ణాలు సహా మూడు రజతాలు, కాంస్యంతో అగ్రస్థానంలో నిలిచారు. సోమవారం జరిగిన వేర్వేరు బౌట్లలో హిమాంశు శర్మ(50కి) ప్రత్యర్థిపై వాకోవర్‌తో పసిడి గెలుచుకోగా, అశిష్(55కి) 4-1 తేడాతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. 90+కిలోల విభాగంలో గౌరవ్ చౌహాన్ 3-2తో పసిడి ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు ఫైనల్లో ప్రత్యర్థుల చేతిలో ఓటములతో అన్మోల్(60కి), ఆదిత్యాయాదవ్(65కి), నీరజ్(75కి) రజతాలకు పరిమితమయ్యారు. పురుషుల 70కిలోల విభాగంలో కార్తీక్ దలాల్‌కు కాంస్యం దక్కింది.

ఇక బౌలర్ల వంతు

ఇంగ్లండ్ లక్ష్యం 371.. ప్రస్తుతం 21/0

రాహుల్, పంత్ శతక మోత • రిషభ్ నయా చరిత్ర

రాహుల్ (137)

హెడింగ్లీ: ప్రతిష్టాత్మక టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీలో బోణీ కొట్టేదెవరో నేడు తేలనుంది! ఇంగ్లండ్, భారత్ మధ్య లీడ్స్ వేదికగా ఆద్యంతం ఆసక్తిగా జరుగుతున్న తొలి టెస్టులో ఇరు జట్లనూ విజయం ఊరిస్తుండగా విజేతలుగా నిలిచేదెవరన్నది ఆసక్తిగా మారింది. ప్రత్యర్థి ఎదుట భారత్ 371 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లిష్ జట్టు.. ఆరు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 21 రన్స్ చేసింది. ఆట ఆఖరి రోజు టీమ్‌ఇండియా విజయానికి 10 వికెట్లు అవసరం కాగా ఆతిథ్య జట్టుకు 350 పరుగులు కావాల్సి ఉన్న నేపథ్యంలో ఐదో రోజు మ్యాచ్ మరింత రసవత్తరంగా మారనుంది. ఇక నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో భారత్.. 96 ఓవర్లలో 364 పరుగులకు ఆలౌట్ అయింది. కేఎల్ రాహుల్ (247 బంతుల్లో 137, 18 ఫోర్లు) శతకంతో మెరవగా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ హీరో రిషభ్ పంత్ (140 బంతుల్లో 118, 15 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి అదే ఫీట్‌ను పునరావృతం చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు.

రాహుల్, పంత్ నెమ్మదిగా..

నాలుగో రోజు ఓవర్ నైట్ స్కోరు 90/2తో బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్‌ఇండియా.. తొలి సెషన్ మొదటి ఓవర్‌లోనే కెప్టెన్ గిల్ (8) వికెట్‌ను కోల్పోవడంతో ఆత్మరక్షణలో పడింది. కార్స్ బౌలింగ్‌లో గిల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో రాహుల్, పంత్ అనవసరపు షాట్లకు పోకుండా నెమ్మదిగా ఆడారు. ఈ ఇద్దరూ తొలి సెషన్‌లో 24.1 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసినా భారత్.. వికెట్ నష్టానికి 63 పరుగులే చేసింది. మూడో రోజు ధాటిగా ఆడిన రాహుల్.. ఫస్ట్ సెషన్‌లో డిఫెన్స్‌కే ప్రాధాన్యమిచ్చాడు. 87 బంతుల్లో అతడు టెస్టులలో 18వ అర్ధ శతకాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత అడపాదడపా బౌండరీలు తప్ప భారత ఇన్నింగ్స్ నత్తనడకను తలపించింది. ఈ ద్వయం ఇంగ్లండ్ బౌలర్ల సహనాన్ని పరీక్షించింది.

ఝూలు విదిల్చి..

తొలి సెషన్‌లో ఇంగ్లిష్ బౌలర్లను పరీక్ష పెట్టిన రాహుల్-పంత్ జోడీ.. భోజన విరామం తర్వాత ఆటతీరును పూర్తిగా మార్చింది. 153/3తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఈ ద్వయం రెచ్చిపోయింది. సెకండ్ సెషన్‌లో 27 ఓవర్లు ఆడి ఏకంగా 5.3 రన్‌రేట్‌తో 145 పరుగులు రాబట్టింది. టంగ్ బౌలింగ్‌లో మూడు బౌండరీలు బాదిన పంత్ 82 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేశాడు. ఆ తర్వాత బషీర్ ఓవర్లో రెండు సిక్సర్లతో అలరించాడు. మరో ఎండ్‌లో రాహుల్ సైతం జోరు పెంచాడు. బషీర్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి 90లలోకి వచ్చిన అతడు.. 62వ ఓవర్లో ఆఖరి బంతిని స్వీపర్ కవర్ దిశగా ఆడి రెండు పరుగులు తీయడంతో టెస్టులలో రాహుల్ 9వ శతకం పూర్తయింది. ఇక హాఫ్ సెంచరీ తర్వాత 27 బంతుల్లోనే ధనాధన్ ఆటతో 95 మార్కుకు చేరుకున్న పంత్.. సెంచరీకి ముందు కాస్త నెమ్మదించాడు. ఎట్టకేలకు బషీర్ బౌలింగ్‌లో డీప్ పాయింట్ దిశగా సింగిల్ తీసి ఒకే టెస్టులో రెండు శతకాలు నమోదుచేశాడు. టెస్టులలో పంత్‌కు ఇది 8వ సెంచరీ. కానీ బషీర్ పంత్‌ను ఔట్ చేసి 195 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు.

లోయరార్డర్ మళ్లీ..

పంత్ నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన కరుణ్ నాయర్ (20)తో కలిసి రాహుల్.. స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. కానీ కొత్త బంతిని తీసుకున్న తర్వాత బ్రైడన్ కార్స్.. రాహుల్‌ను ఔట్ చేశాడు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. కరుణ్.. వోక్స్ బౌలింగ్‌లో అతడికే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. టంగ్ ఒకే ఓవర్లో శార్దూల్ (4), సిరాజ్, బుమ్రాను ఔట్ చేసి కోలుకోలేని దెబ్బకొట్టాడు. జడేజా (25*) కొద్దిసేపు ఇంగ్లీష్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు.

పంత్ (118)

1 టెస్టులలో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన ఏకైక భారత వికెట్ కీపర్ పంత్. అంతర్జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించినవారిలో ఆండీ ఫ్లవర్ తర్వాత పంత్ రెండో స్థానంలో ఉన్నాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 471 ఆలౌట్; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 465 ఆలౌట్; భారత్ రెండో ఇన్నింగ్స్: 96 ఓవర్లలో 364 ఆలౌట్ (రాహుల్ 137, పంత్ 118, టంగ్ 3/72, కార్స్ 3/80); ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 6 ఓవర్లలో 21/0 (క్రాలీ 12*, డకెట్ 9*)

లక్ష్యం ప్రపంచ చాంపియన్‌షిప్: నీరజ్

ఒస్ట్రావా(చెక్ రిపబ్లిక్): టోక్యో వేదికగా జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచ చాంపియన్‌షిలో విజేతగా నిలువడమే తన లక్ష్యమని భారత స్టార్ అథ్లెట్ నీరజ్‌చోప్రా ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు. మంగళవారం జరిగే గోల్డెన్‌స్పైక్ అథ్లెటిక్స్ మీట్‌లో బరిలోకి దిగుతున్న నీరజ్ తన లక్ష్యాలను వివరించాడు. దోహాలో జరిగిన డైమండ్ లీగ్ పోటీలో తొలిసారి 90మీటర్ల మార్క్ అందుకున్న నీరజ్.. తాజాగా ముగిసిన పారిస్‌లో టాప్‌లో నిలిచి సత్తాచాటాడు. దిగ్గజ జావెలిన్‌త్రో కోచ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెన్జీ దగ్గర శిక్షణ పొందుతున్న తాను ఇటీవలి సాధించిన విజయాలతో మరింత ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకున్నానని తెలిపాడు. 'దిగ్గజ కోచ్ జెలెన్జీతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. టెక్నిక్‌ను మెరుగుపర్చుకుంటూ ఈ ఏడాది తొలి టోర్నీలోనే 90మీటర్ల మార్క్ అందుకున్నాను. తాజాగా నెబుర్క్‌లో సీరియస్‌గా ప్రాక్టీస్ చేశాను. ఒస్ట్రావాలో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరుస్తానన్న నమ్మకం ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ 13 నుంచి టోక్యోలో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీలో స్వర్ణం సాధించాలనే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను' అని అన్నాడు.

ముంబైకి పృథ్వీషా వీడ్కోలు

ఎన్‌వోసీ కోసం దరఖాస్తు

ముంబై: దేశవాళీ రంజీ దిగ్గజం ముంబై జట్టుకు స్టార్ క్రికెటర్ పృథ్వీషా గుడ్‌బై చెప్పాడు. గత కొంతకాలంగా ఫామ్‌లేమితో పాటు అనవసర వివాదాలతో వార్తల్లోకెక్కిన షా.. తాను ఇంతకాలం ప్రాతినిధ్యం వహించిన ముంబై జట్టును వీడాడు. రానున్న దేశవాళీ సీజన్‌లో కొత్త జట్టుకు ఆడేందుకు సిద్ధమైన ఈ 25 ఏండ్ల యువ క్రికెటర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) కోసం తాజాగా దరఖాస్తు చేసుకోగా.. ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) అందుకు అంగీకారం తెలిపింది. ఎంసీఏ సెక్రటరీ అభయ్ స్పందిస్తూ.. 'షా అద్భుత నైపుణ్యం గల క్రికెటర్. మేం అతడి నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. భవిష్యత్‌లో అతడు మరింత విజయవంతమవ్వాలి' అని తెలిపాడు. ఈ క్రమంలో షా.. ఎమ్‌సీఏకు రాసిన లేఖలో స్పందిస్తూ 'ఇన్నాళ్లు ముంబైకి ఆడటం చాలా గర్వంగా ఉంది. దిగ్గజ క్రికెటర్లతో ఆడుతూ ఎంతో అనుభవం గడించాను. కెరీర్‌లో కీలకమైన తరుణంలో మరో స్టేట్ అసోసియేషన్‌కు ఆడబోతున్నాను. ఇది నా కెరీర్ ఎదుగుదలకు దోహదం చేస్తుందన్న నమ్మకముంది' అని పేర్కొన్నాడు. పృథ్వీ వచ్చే సీజన్ నుంచి మహారాష్ట్రకు ఆడనున్నట్టు సమాచారం.

పారా తైక్వాండోలో పతక ధమాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ(ఎల్‌పీయూ) వేదికగా ఏషియన్ పారా తైక్వాండో టోర్నీలో తెలంగాణ పారా టీమ్ అదరగొట్టింది. వివిధ విభాగాల్లో రాష్ట్ర పారా అథ్లెట్లు గౌతమ్‌యాదవ్(పీ51), శివ(పీ52) పసిడి పతకాలతో మెరువగా, కృష్ణవేణి(పీ52) రజతం దక్కించుకోగా, సక్కుబాయి(పీ 72), అబ్దుల్(పీ 52) కాంస్యాలు ఖాతాలో వేసుకున్నారు. మొత్తంగా టోర్నీలో రెండు స్వర్ణాలు సహా రజతం, రెండు కాంస్యాలు కైవసం చేసుకున్నారు. ఇదిలా ఉంటే వచ్చే నెల 28 నుంచి మొదలయ్యే ఏషియన్ పారా తైక్వాండో టోర్నీలో గౌతమ్‌యాదవ్, శివ..భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

నాసర్ పోలోలో ఘనంగా పోలో చాంపియన్‌షిప్

శంకర్ పల్లి, జూన్ 22: మాన్సూన్ కప్ పోలో చాంపియన్‌షిప్ 2025 పోటీలు జన్వాడలోని నాసర్ పోలో అండ్ ఈక్వెస్ట్రియన్ అకాడమీలో సోమవారం ప్రారంభమయ్యాయి. దేశంలోని ప్రముఖ జట్టైన రాజస్థాన్ రంబుల్, హర్యానా హరికేన్స్, తెలంగాణ థండర్.. ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. ప్రతి జట్టు విజయం కోసం తీవ్రంగా కృషి చేసాయి. ఫైనల్ లో హర్యానా హరికేన్స్ జట్టు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి తెలంగాణ థండర్ జట్టుపై 2 గోల్స్ తేడాతో విజయం సాధించి మాన్సూన్ కప్ 2025 ను సొంతం చేసుకుంది. సోమవారం ఫైనల్ లో హర్యానా హరికేన్ జట్టు 11 గోల్స్ చేయగా తెలంగాణ థండర్ జట్టు 9 గోల్స్ చేసింది. విజేత జట్టుకు తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా ట్రోఫీని అందజేశారు.

అక్రమ్‌కు స్వర్ణం

తెలంగాణ షూటింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి సాట్స్ షూటింగ్ రేంజ్ వేదికగా జరుగుతున్న 11వ తెలంగాణ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మహమ్మద్ అక్రమ్ పసిడి పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన పురుషుల వ్యక్తిగత క్లే పీజియన్ ట్రాప్ షూటింగ్ ఫైనల్లో అక్రమ్(39) అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో కయ్‌మార్జ్(38), జోహైర్ హసన్(38) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. క్లే పీజియన్ ట్రాప్ షూటింగ్(ఎస్-19)లో అహ్మద్ ముక్తారుద్దీన్(40) స్వర్ణం సాధించాడు. పురుషుల మాస్టర్ క్లే పీజియన్ ట్రాప్ కేటగిరీలో ముజాహిద్ అలీఖాన్(40) పసిడి కైవసం చేసుకోగా, ఫజల్(40), చేతన్ రెడ్డి(35) రజత, కాంస్యాలు ఖాతాలో వేసుకున్నారు.

భాగ్యనగరిలో శంకరప్రసాద్ హంగామా

అగ్ర నటుడు చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ సినిమాకు 'సంక్రాంతి అల్లుడు' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే రెండు షెడ్యూల్స్‌ని పూర్తి చేసుకున్నది. సోమవారం నుంచి మూడో షెడ్యూల్‌ని కూడా అనిల్ రావిపూడి మొదలుపెట్టారు. హైదరాబాద్‌లో మొదలైన ఈ షెడ్యూల్‌లో చిరు, నయనతారలపై కీలక సన్నివేశాలను షూట్ చేస్తారట. ఇందులో శంకర్ ప్రసాద్‌గా 'ఘరానా మొగుడు' నాటి వింటేజ్ చిరంజీవిని ఆడియన్స్ చూస్తారని, చిరంజీవి మార్క్ స్టైలిష్ కామెడీ, మాస్ ఎమోషన్స్ ఈ సినిమాకు హైలైట్ కానున్నాయని చిత్రబృందం చెబుతున్నది. కేథరిన్ థెరిసా, మాస్టర్ రేవంత్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల.

ఊహించని సర్‌ప్రైజ్?

సినీ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఆతృతగా ఎదురుచూస్తున్న క్రేజీ చిత్రాల్లో బాలీవుడ్ స్పై థ్రిల్లర్ 'వార్ 2' ఒకటి. నార్త్ స్టార్ హృతిక్ రోషన్, సౌత్ స్టార్ ఎన్టీఆర్ కలిసి నటించిన క్రేజీ మల్టీస్టారర్ కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ప్రతిష్టాత్మక యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. చిత్రీకరణ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతున్నది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఈ సినిమా తెలుగు వెర్షన్‌కి డబ్బింగ్ చెప్పే పనిలో ఉన్నారట. ఇందులోని ఎన్టీఆర్ పాత్ర గురించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలుగు చూసింది. ఈ సినిమా సెకండాఫ్‌లో ఎన్టీఆర్ పాత్రకు ఓ అద్భుతమైన ఫ్లాష్‌బ్యాక్ ఉంటుందట. ఈ ఎపిసోడ్‌లో యంగ్ టైగర్ ఇచ్చే సర్‌ప్రైజ్ ఊహించని విధంగా ఉంటుందని తెలుస్తున్నది. ఈ సినిమాలోని తారక్ లైవ్ గెటప్‌కీ, ఫ్లాష్‌బ్యాక్ గెటప్‌కీ అసలు పోలికే ఉండదట. ఇక హృతిక్, తారక్ ఎదురెదురు పడినప్పుడు భీకరపోరాటాలతో థియేటర్లు దద్దరిల్లుతాయని మేకర్స్ చెబుతున్నారు. కియారా అద్వాణీ ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

చిత్రం

అలా మారతాడట..!

రీసెంట్‌గా విడుదలైన ప్రభాస్ 'ది రాజాసాబ్' సినిమా టీజర్ ఆడియన్స్‌లో సినిమాపై ఉన్న ఆసక్తిని రెట్టింపు చేసింది. అలాగే.. ఓ కొత్త ప్రశ్న ఉత్పన్నమయ్యేలా కూడా చేసింది. ఇందులో దెయ్యంలా కనిపిస్తున్న సంజయ్‌దత్ పాత్రకీ ప్రభాస్ పాత్రకీ గల సంబంధం ఏంటి? అనేదే ఆ కొత్త ప్రశ్న. టీజర్‌లో ప్రభాస్ 'తాతయ్య' అని దెయ్యాన్ని సంబోధించాడు. కథానుగుణంగా కూడా సంజయ్‌దత్ ఇందులో ప్రభాస్‌కి తాతయ్యేనట. అలాగే.. ప్రభాస్ ఇందులో డ్యూయెల్ రోల్ చేస్తున్నారు అనే రూమర్ కూడా గత కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో వినిపిస్తూ ఉంది. దానికి బలాన్నిస్తూ సింహాసనంపై రాజాసాబ్ గెటప్‌లో కూర్చున్న ప్రభాస్ స్టిల్‌ని, రీసెంట్‌గా విడుదల చేసిన వింటేజ్ ప్రభాస్ స్టిల్స్‌ని నెటిజన్లు చూపిస్తున్నారు. నిజానికి ఇందులో ప్రభాస్ డ్యూయెల్‌రోల్ చేయడంలేదు. 'బుజ్జిగాడు'నాటి వింటేజ్ ప్రభాస్‌ని గుర్తుచేసేలా ఇందులో ఆయన పాత్ర ఉంటుందట. కథానుసారం ఓ సందర్భంలో తాత దెయ్యం ప్రభాస్‌ని ఆవహిస్తుందట. ఆ సందర్భంలోనే సింహాసనంపై రాజాసాబ్‌గా ప్రభాస్ దర్శనమిస్తారట. అదీ అసలు విషయం.

పరమపద సోపానంలో..

'బిగ్‌బాస్' ద్వారా ప్రేక్షకులకు సుపరిచితుడైన అర్జున్ అంబటి హీరోగా నటిస్తున్న చిత్రం 'పరమపద సోపానం'. నాగశివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎస్ మీడియా పతాకంపై గుడిమిట్ట శివప్రసాద్ నిర్మించారు. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. జూలై 11న విడుదల కానుంది. సోమవారం టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు నాగశివ మాట్లాడుతూ..వినూత్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని, ఆద్యంతం అనేక మలుపులతో ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలుస్తాయని హీరో అర్జున్ అంబటి తెలిపారు. తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతినందించే చిత్రమిదని నిర్మాత శివప్రసాద్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డేవ్‌జాండ్, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: నాగశివ.

లెక్కలేనన్ని అభినందనలు

'థియేటర్‌లో సినిమా చూసుకున్నప్పుడు గ్రేట్‌గా అనిపించింది. నా క్యారెక్టర్‌కి అద్భుతమైన స్పందన వస్తున్నది. కాంప్లిమెంట్స్ అయితే.. ఇక లెక్కే లేదు. ముఖ్యంగా ఫైట్ సీక్వెన్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు. నా వ్యక్తిగత జీవితానికి బాగా కనెక్టయిన పాత్ర ఇది. ఇంతమంచి పాత్రను నాతో చేయించిన దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టికీ, మైత్రీ మూవీమేకర్స్ వారికీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా.' అని అనంతిక సనీల్‌కుమార్ అన్నారు. ఆమె లీడ్ రోల్ చేసిన సినిమా '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో అనంతిక మాట్లాడారు. ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకుగాను దర్శకనిర్మాతలకు హీరోలు హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా డీఓపీ విశ్వనాథ రెడ్డి, నటీనటులు కన్నా, సంజన, కిరణ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.